

రణభేరిని జయప్రదం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఆర్థిక, విద్య రంగ సమస్యలపై ఈనెల 25న గుంటూరులో తలపెట్టిన రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ ఎస్.రాజకుమారి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు బి.దుర్గ ప్రసాద్, కె.గోవిందరావు, గౌరవాధ్యక్షులు ఎస్వామి బాబు, సహాధ్యక్షులు ఎస్ విశాలాక్షి మంగళవారం ప్రకటనలో కోరారు. 12వ పిఆర్‌సి నియమించాలని, 29శాతం ఐ ఆర్ ప్రకటించాలని, పెండింగ్ డిఎలను తక్షణమే చెల్లించాలని, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని, ఉద్యోగుల బకాయిలు చెల్లించేందుకు రూట్ మ్యాప్ ప్రకటించాలని, తదితర సమస్యలపై తలపెట్టిన ఈ రణభేరిలో అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మొక్కజొన్న రైతు అతలాకుతలం

- అకాల వర్షాలతో అష్టకష్టాలు
- కొనుగోలు కేంద్రాల్లేక దిగాలు
- ప్రయివేటు వ్యాపారులకే అమ్ముకోవాల్సిన దుస్థితి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మొక్కజొన్న రైతులు అతలాకుతలమవుతున్నారు. అకాల వర్షాలతో అష్టకష్టాలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లేక దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయివేటు వ్యాపారులకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. క్వింటాపై రూ.500 వరకు నష్టానికి విక్రయించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరుగుతోంది. ఏడాదికి మూడు పంటల చొప్పున రైతులు సాగు చేస్తున్నారు. దిగుబడైన మొక్కజొన్న గింజలను బాగా ఆరబెట్టి అమ్మాల్సిన పరిస్థితి ఉండడంతో రైతులు పడుకులు, రోడ్ల పక్కన ఆరబెడుతున్నారు. అకాల వర్షాలు పడుతుండడంతో ఆరబెట్టిన జొన్న గింజలు తడిసిపోయే పరిస్థితి నెలకొంది. జిల్లాలోని 15 మండలాల్లోనూ మొక్కజొన్న సాగు విస్తారంగా జరుగుతోంది. మెట్ట భూముల్లో ఎక్కువగా ఈ పంటనే పండిస్తున్నారు. దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో రైతులు దీని వైపు మొగ్గు చూపుతున్నారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో విస్తారంగా సాగు చేస్తున్నారు. ఇప్పటికే మొక్కజొన్న దిగుబడి జరిగింది. అమ్మకానికి రైతులు సిద్ధం చేస్తున్నారు. పండిన పంటను ఇళ్లల్లో నిల్వ చేసుకోలేక రైతులు ఆరుబయట ప్రదేశాల్లో టార్పాలిన్లు కప్పి దాచుకోవాల్సి వస్తోంది. ఒక్కోసారి అకాల వర్షాలకు జొన్నలు తడిసిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆరుబయట ఎండబెట్టిన జొన్నలు కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.2400 ఉన్నప్పటికీ కొనుగోలు చేసే నాధుడు లేరు. దీంతో రైతులు ప్రయివేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. నాణ్యత, తేమశాతం వంటి కారణాలను సాకుగా చూపి వ్యాపారులు వారికి నచ్చిన వరకు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పంట దిగుబడి ఎక్కువగా వుండడంతో వ్యాపారులు క్వింటాలు జొన్నలు సుమారు రూ.2వేలకే కొనుగోలు చేస్తున్నారు. నిల్వ చేసుకునే సామర్ధ్యం లేకపోవడం తో రైతులు నష్టానికైనా వ్యాపారులకే అమ్ముతున్నారు.



ఆరబెట్టిన మొక్కజొన్న వర్షానికి తడవకుండా టార్పన్లు కప్పుతున్న రైతులు

కొనుగోలు కేంద్రాలేవీ?

జిల్లాలో విస్తారంగా మొక్కజొన్న సాగు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అయితే గత కొంతకాలంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. జిల్లాలో వరి తర్వాత ఎక్కువగా పండించే పంట మొక్కజొన్న అయినప్పటికీ మార్కెటింగ్ శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు ప్రయివేటు వ్యాపారులకే విక్రయించాల్సి వస్తోంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట కు గిట్టుబాటు ధర లభించక పోవడం తో రైతులు నష్టపోతున్నారు.

అవస్థల నడుమ చదువులు

- భోజన సౌకర్యం లేక వంట చేసుకుంటున్న విద్యార్థులు
- ఇదీ రెసిడెన్సియల్ ఐటిఐలో పరిస్థితి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పారిశ్రామిక విద్య అభ్యసించి మంచి ఉద్యోగులుగా ఉన్నత స్థాయిలో ఉండాలని, భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని ఎంతో ఆసక్తితో సుదూర ప్రాంతాల నుంచి చదువుకునేందుకు వస్తున్న విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం వసతి కల్పించినా భోజన సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులే స్వయంగా వంట చేసుకుని తరగతులకు వెళ్తున్నారు. దీంతో చదువు కోసం వచ్చిన విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

మండలంలోని భద్రగిరి రెసిడెన్షియల్ పారిశ్రామిక శిక్షణా కేంద్రం (ఐటిఐ)లో చదువుతున్న విద్యార్థుల్లో కొంతమంది సాలూరు, మక్కువ, జియమ్మవలస, కురుపాం, పార్వతీపురం తదితర బయట ప్రాంతాల నుంచి వచ్చి చదువుతున్నారు. వీరు రాకపోకలు సాగించడానికి ఇబ్బందిగా ఉండడంతో స్థానికంగా ఉన్న వసతి గృహంలో ఉంటూ తరగతులకు వెళ్తున్నారు. ఇక్కడ 20మంది వరకు విద్యార్థులు ఉంటున్నారు. అయితే ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం భోజన ఏర్పాట్లు చేయకపోవడంతో ఇంటి నుంచి వంట పాత్రలు, బియ్యం, పప్పులు, కూరగాయలు తదితర వస్తువులను తీసుకొచ్చి స్వయంగా వంట చేసుకుంటున్నారు. ప్రతిరోజు విద్యార్థులు ఒక గంట సమయం వంట పని చేసుకుని తరగతులకు హాజరవుతున్నారు.

కనీస సౌకర్యాలు కరువు



శిథిలావస్థలో ఉన్న ఐటిఐ



భద్రగిరి ఐటిఐ వసతి గృహం విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. శిథిలమైన గదుల్లో ఉంటున్న విద్యార్థులు క్షణక్షణం భయంతో గడపాల్సి వస్తుంది. ఉన్న ఒక్క బోరు పైనే ఆధారపడి వంటలు, స్నానాలు, బట్టలు ఉతకడం వంటి పనులు చేస్తున్నారు. మరుగుదొడ్లు ఉన్నా రన్నింగ్ వాటర్ లేకపోవడంతో నిరుపయోగమయ్యాయి. స్వచ్ఛమైన నీటి కోసం సమీపంలో ఉన్న పాలిటెక్నికల్ కళాశాలకు వెళ్లి తాగుతున్నారు. ప్రభుత్వం గిరిజన విద్యార్థుల సంక్షేమం పూర్తిగా విస్మరించింది. ఇక్కడ సరైన సౌకర్యాల్లేకపోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చి చదివేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. 15 ఏళ్ల క్రిందట అడ్మిషన్‌తో పోల్చుకుంటే దాదాపు సగ్గానికి సగం తగ్గిపోయింది. వసతి గృహం భవనం కూడా పూర్తిగా శిథిలమవుతోంది. కిటికీలు, తలుపులు పాడయ్యాయి. విద్యార్థులకు రక్షణ కరువైంది. ఐటిఐ విద్యార్థుల సమస్యలను అధికారులు గుర్తించి పరిష్కరిస్తే ఏజెన్సీలో పారిశ్రామిక విద్య మెరుగుపడుతుందని గిరిజన సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.



అడలి వ్యూపాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఐటిడిఎ పిఒ

డోలీ గ్రామాలకు తొలి ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ద్వారా చేపడుతున్న రోడ్డు పనుల్లో డోలీ గ్రామాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఐటిడిఎ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో పదో తరగతి పాసైన విద్యార్థులు తప్పనిసరిగా ఇంటర్‌లో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల్లో మెనూ పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన నిరుద్యోగ యువతకు స్కిల్ శిక్షణలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని సూచించారు. వైద్యశాఖకు సంబంధించి మలేరియా, టిబి, డెంగీ వంటి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

50 పీవిటిజీ హెూమ్ స్టేలు లక్ష్యం కావాలిలి

ఐటిడిఎలో పర్యాటకుల కొరకు 50 పీవిటిజీ హెూమ్ స్టేలను సిద్ధం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అడాలి వ్యూపాయింట్ సందర్శన అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. సీతంపేట చుట్టు పక్కల సుందరమైన ప్రదేశాలున్నాయని, అయితే వచ్చే పర్యాటకులు బస చేసేందుకు వీలుగా అవసరమైన వసతుల్లేవని అన్నారు. ఇందుకోసం ఈ ఏడాది ఐటిడిఎ ద్వారా వ్యూ పాయింట్స్, జలపాతాలు చుట్టుపక్కల 50 పీవిటిజి హెూమ్ స్టేలను నిర్మించేలా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇందుకు స్థానిక యువతకు రుణాలు మంజూరుచేయాలని, పర్యాటకుల కొరకు ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆడలి వ్యూ పాయింట్ అతి సుందరమైన ప్రాంతమని, పర్యాటకులను ఆకర్షించేలా ఈ ప్రాంతాన్ని సహజ సిద్ధంగా తీర్చిదిద్దాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అత్యుత్తమ పర్యాటక ప్రదేశాల్లో ఒకటని, జిల్లా యంత్రాంగం మంచి పర్యాటక కేంద్రంగా గుర్తించి కొన్ని సౌకర్యాలు కల్పించిందని అన్నారు. వ్యూ పాయింట్‌లో కాంక్రీటుతో కట్టిన కట్టడాలు కన్నా వెదురుతో చేసిన కట్టడాల వల్ల సహజసిద్ధంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేసి వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో పాలకొండ సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ రమాదేవి, డిఇ నాగభూషణం, ఎపిఒ చినబాబు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పని గంటలను వెనక్కి తీసుకోవాలి

పలుచోట్ల కార్మికుల నిరసన

ప్రజాశక్తి - కురుపాం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై 8 గంటల నుంచి 13 గంటలకు పెంచిన పనిగంటలను వెనక్కి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రీన్ అంబాసిడర్లు, పంచాయితీ కార్మికులతో కలిసి నిరసన కురుపాంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, అందులో భాగంగానే శుక్రవారం అసెంబ్లీలో 8 గంటల పని దినాన్ని13 గంటలుగా మారుస్తూ కూటమి ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదని అన్నారు. కూటమి ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉప సంహరించు కోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ఈ సమస్యపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు కె. సీతారాం, కార్మికులు సింహాచలం, చంటి, గౌరీ, వినోద్, పాండు, తదితరులు పాల్గొన్నారు.



కురుపాంలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు



సాలూరులో ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

సాలూరు : పని గంటల పెంచుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు పట్టణంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కమిటీ నాయకులు టి.రవి, టి.శంకర్, టి.రాముడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వస్తే కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పి ఆ హామీ నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. కార్పొరేటర్ల కోసం ప్రస్తుతం ఉన్న 8 గంటల పనిగంటలను 13గంటలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడం దారుణమన్నారు. ఒకవైపు కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఢిల్లీ వేదికగా కార్మిక వర్గం గొంతెత్తి పోరాడుతుంటే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికులకు ద్రోహం చేస్తూ పని గంటలు పెంచుతున్నాయని విమర్శించారు. ఎన్నికల ముందు ఒకలా, గెలిచిన తర్వాత మరోలా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. తక్షణమే పెంచిన పనిగంటలను తగ్గించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పోలరాజు, వెంకట్రావు, వెంకన్న, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



కొట్టుకుపోయిన రిటైనింగ వాల్‌కు అడ్డంగా వేసిన ఇసుక బస్తాలు

భారీ వర్షాలకు కొట్టుకుపోయిన రిటైనింగ్ వాల్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం రావాడ, వట్టిగెడ్డ రిజర్వాయర్ కుడి ప్రధాన కాలువలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రిటైనింగ్ వాల్ కొట్టుకుపోయింది. దీంతో రైతులు వరద నీరు పంట పొలాలపై పడడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై చినమేరంగి నీటి సంఘం అధ్యక్షులు వట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు వైస్‌చైర్మన్ ముంజేటి ప్రసాద్ వెంటనే స్పందించి కొట్టుకుపోయిన రిటైనింగ్ వాల్ స్థానంలో ఇసుక బస్తాలతో గండిని పూడ్చారు. ప్రస్తుతం రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తక్షణ చర్యలు చేపట్టారు. భారీ వర్షాల వల్ల కొట్టుకుపోయిన రిటైనింగ్ వాల్ విషయాన్ని రావాడ- వట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు చైర్మన్ ఎం.సత్యం నాయుడు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే రిటైనింగ్ వాల్ నిర్మించాలని కోరారు.

జెసిని కలిసిన 104 జిల్లా మేనేజర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డిని 104 జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ మంగళవారం జెసి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందచేశారు. ఈ సందర్భంగా 104 వాహనాలు జిల్లాలో ఎన్ని ఉన్నాయి, వాటి పనితీరు ఎలా ఉంది, ముఖ్యంగా గిరిశిఖర ప్రాంత సమీప గ్రామాల్లో గిరిజనులకు అందుతున్న వైద్య సేవలు తీరు, గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్న తీరు, మందుల లభ్యత, వైద్య పరీక్షలు మొదలైన వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందించాలని జె సి సూచించారు.



జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డికి పూల మొక్కను అందజేస్తున్న 104 జిల్లా మేనేజర్

దాచుకున్నారు... అమ్ముకున్నారు

పాలకొండ : యూరియా కొరత తీవ్రంగా ఉంది. యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఒక కట్ట కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూ లైన్లో వేచి చూడాల్సిన పరిస్థితి వస్తుంది. ఎన్ని ఎకరాలున్నా ఒక్క బస్తా దొరికితే చాలన్న పరిస్థితిలో రైతులు ఉన్నారు. కొంతమంది అధికారులు, నాయకులు యూరియాను బ్లాక్ చేసి అమ్ముకుంటున్నట్లు ఆరోపణ వినిపిస్తున్నాయి. మండలంలో బెజ్జి సచివాలయం పరిధిలో టిడి పారాపురంలో సుమారు 100బస్తాలు యూరియా వచ్చినప్పటికీ ఎవరికీ ఇవ్వకుండా దాచిపెట్టడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆర్ అండ్ బి రోడ్లు మంజూరు చేయాలి : ఎమ్మెల్యే

పాలకొండ : సీతంపేట మండలంలో గిరిజన గ్రామాలకు రెండు ఆర్ అండ్ బి రహదారులు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మంగళవారం జరిగిన శాసనసభ సమావేశాల్లో ఆ శాఖ మంత్రిని కోరారు. కోడిసు నుంచి కడగండి వరకు, అలాగే కోడిసు నుంచి వజ్జాయిగూడ వరకు రహదారిని మంజూరు చేయాలని కోరారు.



ఏజెన్సీలో సంచరిస్తున్న ఏనుగులు

ఏనుగుల దాడిలో పంటలు ధ్వంసం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో తిత్తిరి పంచాయతీలో గల గిరి శిఖర గ్రామాలైన తులసి, సిడిగూడ, పులిపుట్టి, టోంపలపాడు పరిసర గిరిశిఖర గ్రామాల్లో మంగళవారం నాలుగు ఏనుగుల గుంపు సంచరిస్తూ గిరిజన రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న, వరి, అరటి పంటలను ధ్వంసం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కుంకీ ఏనుగులను తీసుకొచ్చి ఈ ఏనుగులను దూర ప్రాంతాలకు తరలిస్తామని ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చి తమ పంటలకు, ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - సీతానగరం

రైతు ఆరు గాలం కష్టపడిన పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని అంటిపేటలో రైతు సంఘం మండల కమిటీ సమావేశం రెడ్డి లక్ష్మునాయుడు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ దేశంలో ప్రజలందరికీ ఇంత తిండి పెట్టే రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు అమ్మబోతే అడివి కొనబోతే కొరివిలా తయారైందన్నారు. గిట్టుబాటు ధర లేక, ప్రభుత్వ సహాయం అందక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధరను ప్రకటించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రైతులకు నష్టం కలిగించే మూడు నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రానికి మద్దతు పలుకుతున్నాయని, ఓట్ల కోసం వేదికలపై రైతే రాజు అని కల్లబొల్లి మాటలు చెబుతున్నాయని అన్నారు. ఢిల్లీ నడిబొడ్డున దేశ రైతాంగం ఏడాది పాటు ఉద్యమిమిస్తే వారిపై కేంద్రప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించిందన్నారు. అలాగే ప్రస్తుతం రైతుకు యూరియా, ఎరువులు సక్రంగా అందుబాటులో లేకుండా ఇబ్బందులు పెడుతుందన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు లేక ప్రైవేట్ వ్యాపారస్తులు వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేసి రైతులు దివాలా తీస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచాలంటే రైతాంగం యావత్తు ఐక్యంగా ఉద్యమించి పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల నూతన కమిటీ ఎన్నికైంది. మండల అధ్యక్షులుగా చిట్టి సూర్యనారాయణ, కార్యదర్శిగా సిరికి శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులుగా రెడ్డి రాము, బల్ల నారాయణస్వామి, బొన్నాడ కృష్ణమూర్తి, రెడ్డి సత్యనారాయణ, పైల విశ్వనాథం, లంక గోపాలం, బంకురు నూకం నాయుడు, బోను స్వామి నాయుడు, గుల్ల తిరుపతి ఎన్నికయ్యారు.




సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి

ప్రత్యేక వైద్య శిబిరాలతో మెరుగైన సేవలు

ప్రజాశక్తి- పార్వతీపురంటౌన్

ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి, ఆరోగ్య అవగాహన కల్పించాలని జిల్లా ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. మండలంలోని పెదబొండపల్లి పిహెచ్‌సిలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్ల వద్ద అందజేస్తున్న వైద్య పరీక్షలు పరిశీలించారు. వైద్య శిబిరాన్ని ఎంత మంది ప్రజలు వినియోగించుకున్నారు, ఆరోగ్య సమస్యలు, చికిత్సా వివరాలు స్పష్టంగా నమోదు చేయాలన్నారు. ప్రజలు ఈ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు జి.ధరణి, పిఎల్ గోపాలకృష్ణ, స్పెషలిస్ట్ వైద్యులు కామేశ్వరి, భరత్ చంద్ర, రమ్య, ఆయుష్ వైద్యులు సుశీల, డెమో సన్యాసిరావు, సూపర్వైజర్లు వెంకట నాయుడు, జయలక్ష్మి, శంకర్, వైద్య, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న జగన్మోహనరావు

290మందికి వైద్య పరీక్షలు

వీరఘట్టం : మండలంలోని వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని కంబర, నీలానగరం గ్రామాల్లో మంగళవారం ఎస్ ఎన్ ఎస్ పి ఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యాధికారులు ఎం.సాయి కుమార్, గణేష్, గౌతమ్ 290 మందికి వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, రక్తపోటు, మధుమేహ, కేన్సర్, సికిల్ సెల్, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్యతనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

163 మందికి వైద్య సేవలు

పాచిపెంట : స్వస్త్ నారీ స్వశక్త్ అభియాన్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక సచివాలయం వద్ద వైద్యాధికారి రవిచంద్ర ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 163 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆది కర్మయోగిపై పిఒ సమీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆది కర్మయోగి అభియాన్ కింద సిద్ధం చేసిన విజన్ ప్లాన్‌ను ఎంపిడిఒలు పునః పరిశీలించి ఐటిడిఎకు సమర్పించాలని జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయంలోని గిరిమిత్ర సమావేశ మందిరంలో ఆది కర్మయోగి అభియాన్‌పై ఎంపిడిఒలు, జిల్లా మాస్టర్ ట్రైనీలు, బ్లాక్ మాస్టర్ ట్రైనీలతో జెసీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కురుపాం, కొమరాడ, సాలూరు, పాచిపెంట, మక్కువ, సీతంపేట, పాలకొండ, భామిని, వీరఘట్టం మండలాల్లోని 165 గ్రామాల్లో ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం అమలు కానుందని తెలిపారు. ఈ 165 గ్రామాల్లో గల 949 హేబిటేషన్లను కవర్ చేస్తూ గ్రామ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇదివరకే ఆదేశించామని తెలిపారు. అందులో భాగంగా ఈనెల 6 నుంచి ఇప్పటి వరకు నిర్దేశించిన షెడ్యూలు మేరకు ప్రతి హేబిటేషనును కవర్ చేస్తూ గ్రామసభలు నిర్వహించిన సంగతిని ఆయన గుర్తుచేశారు. 5 గ్రామాలు మినహా మిగిలిన 160 గ్రామాల్లో గ్రామ కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైందని, బుధవారం వరకు సమయం ఉన్నందున ఆ గ్రామాలకు చెందిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం కాగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు సిద్ధం చేసిన గ్రామ కార్యాచరణ ప్రణాళికను సమర్పించడంతో పాటు ఆది కర్మయోగి వెబ్ సైట్ నందు నమోదు చేయడం పట్ల అవగాహన ఉండాలన్నారు. సమావేశంలో ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, పలువురు ఎంపిడిఒలు, జిల్లా మాస్టర్ ట్రైనీలు, బ్లాక్ మాస్టర్ ట్రైనీలు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి


కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న సిఐటియు నాయకులు

శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో గల శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలు కరువైందని, వెంటనే వాటిపై దృష్టి సారించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజుకు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ పట్టణంలో గల వివిధ శ్మశానాల్లో బోర్లు పూర్తిగా పాడయ్యాయని, రోడ్లు కూడా లేవన్నారు. ఇప్పటికే పట్టణంలో ప్రభుత్వం కేటాయించి గుర్తింపు పొందిన 16 శ్మశానాల్లో 14 మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. వీటిలో కూడా రోడ్లు, శ్మశాన స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని పేర్కొన్నారు. కావున ఇకనైనా అధికారులు చిత్తశుద్ధితో స్పందించి పట్టణంలో గల శ్మశానవాటికల్లో రోడ్లు వేయాలని, బోర్లు తీయాలని, విశ్రాంతి కోసం షెడ్లు వేయాలని, గేట్లు, ప్రహరీ గోడలు నిర్మించాలని, శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి కృషి చేయాలని కోరారు. కబ్జాదారులపై తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.రాజశేఖర్, పి.గాంధీ, పి.వరదరాజు, జె.సత్తిరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


టిడిపిలో చేరిన మండల వైసిపి ప్రజాప్రతినిధులు

టిడిపి తీర్థం పుచ్చుకున్న వైసిపి ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రాష్ట్ర టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో కురుపాం ఎమ్మెల్యే ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆధ్వర్యాన ఎంపిపి ఉరిటి రామారావు, పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు టిడిపి కండువా వేసుకున్నారు. విజయవాడలో వీరి చేరిక జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు, కురుపాం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కొత్తగా చేరిన వారు ప్రస్తుతం పార్టీలో ఉన్న నాయకులతో సమిష్టిగా కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్, నాయకులు దత్తి లక్ష్మణరావు, మాూరాపు పురుషోత్తం నాయుడు, అక్కేన మధుసూదన్‌రావు, అంబటి రాంబాబు, ముదిలి బాబు విజయవాంకుశం, కోట సుమన్, వెంకటనాయుడు, మండల స్థాయి నాయకులు, తదితరులు ఉన్నారు.

పోలమాంబకు పసుపు కొమ్ములతో అలంకరణ

ప్రజాశక్తి - మక్కువ

దసరా నవరాత్రుల సందర్భంగా రెండో రోజు మంగళవారం పోలమాంబ అమ్మవారికి గాయత్రి అవతారంలో దర్శనం ఇవ్వగా, భక్తులు అమ్మవారికి పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. వేద పండితులు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో హెూమాలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి బి శ్రీనివాస్ భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

25న గార్బేజ్ ఫ్రీ ఇండియా

ప్రజాశక్తి - సాలూరు

మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని స్థానిక మున్సిపాల్టీ ఆధ్వర్యంలో 'గార్బేజ్ ఫ్రీ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఏక్ దిన్, ఏక్ ఘంట, ఏక్ శాత్ - 2025" అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కమిషనర్ టిటి రత్న కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 25న స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో జరగనుందని, ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలు, సభ్యులు హాజరు కావాలని అయన తెలిపారు.

గ్రామసభలు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజలు నేరుగా తమ సమస్యలను, అవసరాలను అధికారుల ముందుంచుకునేందుకు గ్రామసభలు ప్రధాన వేదికలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మన్యం జిల్లా కన్వీనర్ పాలక సుధీర్, కో-కన్వీనర్ కద్రక వైకుంఠరావు అన్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామసభలు సక్రమంగా నిర్వహించాలని మంగళవారం స్థానిక తహశీల్దార్ శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న గ్రామసభలు సక్రమంగా నిర్వహించాలని, ఈ సభల్లో అన్ని శాఖల అధికారులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు గ్రామసభలు కీలకమని, ప్రజాస్వామ్య అమలుకు పునాది గ్రామసభలని, అటువంటి గ్రామసభల్లో ప్రజలంతా పాల్గొనేలా అవగాహన కల్పించాలని కోరారు.

ఎడతెరిపి లేని వర్షం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. కురుస్తున్న వర్షంతో వ్యాపారాలు, ఉద్యోగులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రోడ్లపై నీరు చేరడంతో బురదమయంగా మారింది.

మైనర్లకు వాహనాలివ్వొద్దు

ప్రజాశక్తి - సీతంపేట

మైనర్లకు వాహనాలివ్వొద్దని ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డలు, వాగులు, చెరువులు నీటితో నిండి ఉన్నాయని కావున చిన్నారుల కదలికలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కోరారు.

తొలగింపు ఆలోచన మానుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన గర్భిణుల వసతి గృహాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని తొలగించాలనే ఆలోచన జిల్లా అధికారులు మానుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కమిటీ అధ్యక్షులు తాడంగి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. గత ఏడేళ్లుగా అరకొర జీతంతో గిరిజన గర్భిణులకు వైద్య సేవలు అందిస్తున్నారని వివరించారు. అలాగే వారికి గత ఏడు నెలలుగా ఇవ్వాల్సిన బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సాలూరు, గుమ్మలక్ష్మీపురం వైటీసీల్లో నిర్వహిస్తున్న గిరిజన గర్భిణుల వసతి గృహం సేవలకు నీతి అయోగ్ కూడా గుర్తించి ప్రసంసించిదని తెలిపారు.

కార్మిక హక్కులు, భద్రత కాపాడాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్


కార్మికుల హక్కులు, భద్రత కాపాడే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మన్యం జిల్లా ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో అమలులో ఉన్నట్లుగానే 8గంటల పని పద్ధతి కొనసాగించాలని, అదనపు పనులు చేయిస్తే తగినంత ఓవర్ టైం భత్యం చెల్లించాలనే నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, కార్మిక చట్టాల సవరణల పేరుతో కార్మికులకు అన్యాయం జరుగుతోందని, ఇది శ్రామిక వర్గాన్ని దోపిడీ చేయడానికి దారితీస్తుందని విమర్శించారు. అలాగే కార్మిక విభాగం అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, చట్టాలను ఉల్లంఘిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సింహాద్రి దుర్గారావు పాల్గొన్నారు.

ఉత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ పరిశీలన

నగర పంచాయతీ కార్యాలయం పనితీరుపై అసంతృప్తి

ప్రజాశక్తి - పాలకొండ

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.ప్రభాకర్ రెడ్డి పట్టణంలో మంగళవారం పర్యటించారు. కోట దుర్గమ్మ వారి దర్శనంతో పాటు ఉత్సవాల ఏర్పాట్లపై క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై సమీక్షించారు. అనంతరం నగర పంచాయతీ కార్యాలయం పనితీరుపై సమీక్షించారు. ముందుగా ఆలయ కార్యనిర్వాహక అధికారి వివి సూర్యనారాయణ, సిబ్బంది అతిథి మర్యాదలతో కలెక్టర్‌ను ఆలయంలో తీసుకెళ్లి ప్రధాన అర్చకులు లక్ష్మీ ప్రసాద్ శర్మ ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ అభివృద్ధిపై సమీక్షించారు. పశుసంవర్ధక శాఖ నుంచి అధికారికంగా ఆలయానికి ఆనుకొని స్థలం వస్తే ఆలయ అభివృద్ధి జరుగుతుందని పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్ కలెక్టర్ దృష్టి తీసుకురాగా, వెంటనే దీనిపై పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వాలని సబ్ కలెక్టర్ పవర్ స్వప్నల్ జగన్నాధ్‌కు సూచించారు. అదేవిధంగా ఆలయంలో జరుగుతున్న అన్నప్రసాద కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎంతమందికి భోజనానికి వస్తారని ఎంత నిధులు అవుతున్నాయని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడినుంచి స్థానిక నగర పంచాయతీకి చేరుకొని కార్యాలయం అస్తవ్యస్తంగా ఉండడంతో కమిషనర్ రత్నరాజును మందలించారు. ప్రభుత్వ కార్యాలయం ఇలాగే ఉంటుందా అంటూ ప్రశ్నించారు. అక్కడ సిబ్బంది ఎవరు ఏ పని చేస్తున్నారని వివరాలను అడిగి తెలుసుకున్నారు. నగర


అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి, సబ్‌కలెక్టర్ పవార్ స్వప్నల్ జగన్నాథ్

పంచాయతీ పరిధిలోని ఆస్తులను కాపాడాలన్నారు. నగర పంచాయతీ ఆస్తులను గుర్తించాలన్నారు. అదేవిధంగా చెరువులకు కూడా బౌండరీలు గుర్తించి, చెరువులకు ఇరువైపులా మొక్కలు నాటాలన్నారు. నగర పంచాయతీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి, ఇఇ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి - సీతానగరం

ఆరోగ్యానికి ఆయుర్వేదం ఆవశ్యకతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ టి.హేమాక్షి తెలిపారు. 10వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని బూర్జ, ఆయుర్వేద వైద్యశాలలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయుర్వేద ఆవశ్యకత, అందుబాటులో ఉన్న ఉచిత ఆయుర్వేద వైద్య సేవలపై ఆమె గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ధన్వంతరి జయంతి సందర్భంగా ప్రతి ఏటా సెప్టెంబర్ 23న జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆయుర్వేద ఫర్ పీపుల్ అండ్ ప్లానెట్ సారాంశం అని అన్నారు. మన దేశ ఆయుర్వేద వైద్యానికి ప్రాచీన కాలం నుంచి ఎంతో ప్రాముఖ్యత ఉందని, దీర్ఘకాలికంగా వేధిస్తున్న అనేక రుగ్మతలకు ఆయుర్వేద వైద్యం ద్వారా మంచి ఫలితాలు ఉంటున్నాయని తెలిపారు. కాలానుగుణంగా ప్రబలే కొన్ని అనారోగ్య సమస్యలకు ఆయుర్వేదం చక్కని పరిష్కారమని, ఇప్పటికే పలు గ్రామాల్లో ఉచిత ఆయుర్వేద శిబిరాలు నిర్వహిస్తూ అనేక రుగ్మతలకు వైద్యం అందజేస్తూ, ప్రజల్లో ఆయుర్వేద ఆవశ్యకతపై అవగాహన పెంపొందిస్తున్నామని తెలిపారు. ఆయుష్ శాఖ ద్వారా ఆశా కార్యకర్తలకు కూడా శిక్షణ ఇచ్చి, ప్రజలకు ఆయుర్వేదంపై అవగాహన కల్పించేలా పుస్తక మెటీరియల్‌ను


ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి హేమాక్షి

అందజేస్తున్నామన్నారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ఔషధ మొక్కల ఉపయోగాలపై డాక్టర్ హేమాక్షి అక్కడి వారికి వివరించారు. కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది శ్రీనివాసరావు, పద్మ, విజయ, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - సీతానగరం

మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో గల యాడిద శ్రీదేవి ఇంట్లో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకునేందుకు దాతలు ముందుకొస్తున్నారు. ఆర్థిక సహకారం అందిస్తున్నారు. ఇంతవరకు ఆ కుటుంబానికి వాసవీ క్లబ్ నుంచి నెలకు సరిపడా నిత్యావసరాల సరకులు, బట్టలు, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం కమిటీ సభ్యులు రూ. 10 వేలు, బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన రూ.5 వేలు, పెదభోగిల పంచాయతీ ఉప సర్పంచ్ అరవింద కుమార్ రూ.3 వేలు, గెడ్డలుప్పి కూడలిలోని కృషి విద్యానికేతన్ నిర్వాహకులు డి.శ్రీనివాస్ రూ.2 వేలు ఆర్థిక సాయం చేశారు. వీరితో పాటు మరికొంత మంది దాతలు ముందుకొచ్చారు.

డిజిటల్ స్క్రీన్ ద్వారా అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలోని ఉన్న తాడిపాయి, కిల్లాడ, ధోనుబాయి, ధారపాడు, గుమడలో మలేరియా అధికారి సత్యనారాయణ, వెలుగు డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో డిజిటల్ స్క్రీన్ గిరిబజార్ వాహనం ద్వారా మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం కమలాకుమారి, చంద్రమౌళి, పిహెచ్‌సి వైద్యాధికారి భానుప్రతాప్, అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ జె.మోహనరావు, ఎంటిఎస్ ఝాన్సీ రాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో ఆధునిక పద్ధతులు

ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తక్కువ సమయంలో ఎక్కువ ప్రయోజనం పొందాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రబంధుకులు శ్రావణ్ కుమార్ నాయుడు అన్నారు. జియ్యమ్మవలస మండలం చింతలబెలగాంలో ఎం.సత్యంనారాయణ, పెద్దింటి కృష్ణ, జామి శంకరరావు, ఎస్.కూర్మినాయుడుల్లో డ్రోన్ ద్వారా జిల్లేడు ద్రావణం స్ప్రేయింగ్ చేశారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లేడు ద్రావణం స్ప్రేయింగ్ చేసుకోవడం వల్ల అధిక ప్రయోజనం రైతులు పొందుతారన్నారు. డ్రోన్‌కు ఎకరాకు రూ.400 ఖర్చవుతుందని, జిల్లేడు ద్రావణానికి ఖర్చు ఏమీ ఉండదని అన్నారు. పంటలకు హాని చేసే పురుగులు, తెగుళ నియంత్రణకు బాగా పని చేస్తుందన్నారు. ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో పూర్తి స్థాయిలో ప్రకృతి వ్యవసాయం చేయాలంటే డ్రోన్ ద్వారా సులువు అవుతుందని, ఖర్చు లు కూడా తగ్గుతాయని వివరించారు. రీజనల్ తీమోటిక్ లీడ్ కె.ప్రకాష్ మాట్లాడుతూ రైతులకు పెట్టుబడులు పెరిగి, దిగుబడులు తగ్గుతున్న సమయంలో కొత్త పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో పని సులభంగా అవుతున్న మార్గాలు పాటించాలన్నారు. రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ డ్రోన్ వల్ల ఉపయోగాలను రైతులకు


డ్రోన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనర్ బి.శ్రీరామ్, బి.ధనుంజయ, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లేడు ద్రావణం..పోషకాల మయం

ప్రజాశక్తి - పాచిపెంట

జిల్లేడు ద్రావణంలో అనేక పోషకాలుంటాయని, కావున అన్ని పంటలపై పిచికారీ ద్వారా ఆరోగ్యవంతమైన పంటను పండించవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతి రావు అన్నారు. మండలంలోని పిండ్రంగివలసలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లేడు ద్రావణం తయారీ అతి సులువైనదని, ఎకరానికి 200 లీటర్ల నీటిలో 20 కిలోల జిల్లేడు ఆకులు, 10 కిలోల ఆవు పేడ, 10 లీటర్ల ఆవు మూత్రం వేసి 48 గంటల పాటు మురగపెట్టి వడగట్టి పిచికారి చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం పడుతున్న వర్షాలకు తెగుళ్ల ఆశించే అవకాశం ఉందని, పత్తి పంటపై పేనుబంక, పచ్చ దోమ ఆశిస్తున్నాయని, వీటి నివారణకు వేప గింజల కషాయం ఉత్తమమైందని తెలిపారు. అనంతరం వ్యర్థపు నీటి ద్వారా పండించిన రైతు వై.లక్ష్మణరావు పత్తి పంటను పరిశీలించారు. అనంతరం సిఆర్‌పి కర్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 200 లీటర్ల జిల్లేడు ద్రావణాన్ని తయారు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బడ్నాన వీరయ్య, గ్రామ పెద్దలు, విఎఎ ఝాన్సీ పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని పెదభోగిలి పంచాయతీలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ మాట్లాడుతూ నానో యూరియా రైతులకు నానో యూరియా వాడకం గురించి వివరించారు. అలాగే వరిచేల గట్లపై కందులు నాటడం వల్ల రైతులు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

సాలూరు : రైతులు ఏ గ్రేడ్ మోడల్, ఎటిఎం పద్ధతుల్లో కూరగాయలను విభిన్న పద్ధతుల్లో సాగుచేయడం ద్వారా అదనపు ఆదాయం పొంద వచ్చునని మండల వ్యవసాయధికారిని కె.శిరీష తెలిపారు. మండలంలోని అన్నంరాజువలస, మామిడిపల్లి లో పొలం పిలుస్తుంది" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు నూతన సాగు విధానాలైన ఏ-గ్రేడ్ మోడల్, ఏటీఎం పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఎఎలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వే పొరపాట్లు సరిదిద్దండి : భీశెట్టి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన లో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన రీ సర్వేలో అనేక పొరపాట్లు జరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ పొరపాట్లను సరిద్దేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈమేరకు రాష్ట్ర సర్వే సెటిల్ మెంట్స్, భూమి రికార్డుల డైరెక్టర్ రోణంకి కుర్మనాథ్‌ను మంగళగిరిలోని తన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులు తమ భూమి హక్కులు వేరొకరి పేరుతో రికార్డుల్లో ఉండడంతో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ విసిగిపోతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతుకు న్యాయం చేయాలని కోరారు.


ఇ-క్రాప్‌పై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్, ఎఒ

30లోగా ఇ-పంట నమోదు చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఈ నెల 30లోగా రైతులు తమ పంటలను ఇ-పంట నమోదు చేయాలని తహశీల్దార్ జె.ప్రసన్న కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ- పంట ద్వారా రైతులు తమ పంటల విస్తీర్ణం నమోదు చేసుకోవాలన్నారు. ఇ- పంట నమోదులో జాయింట్ ఐపిఎం పట్టాలు ఓపెన్ చేసి ఆ రైతు భూవిస్తీర్ణం నమోదు చేయడం ద్వారా ఆ రైతుకు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బంది రాదని అన్నారు ఈ కార్యక్రమంలో ఎఒ ఎస్ అవినాష్ ఆర్ ఐ ఎన్ శ్రీనివాసరావు వీఆర్వోలు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డేటా ఆధారంగానే ఎఫ్‌పిఒల వ్యాపారాభివృద్ధి

డిజిటల్ గ్రీన్ రాష్ట్ర కో ఆర్డినేటర్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

డేటా ఆధారంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు (ఎఫ్‌పిఒ) వ్యాపార అభివృద్ధి జరుగుతుందని డిజిటల్ గ్రీన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ వేముల కరుణాకర్ అన్నారు.డిజిటల్ గ్రీన్ ట్రస్ట్, వాల్‌మార్ట్ సంస్థ భాగస్వామ్యంలో జిల్లాలో అమలవుతున్న ఈఫార్మ్ ప్రాజెక్టులో భాగంగా జట్టు సంస్థ, వెలుగు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్ ప్రాంగణంలో 8 రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు (ఎఫ్పిఓలు) చెందిన డైరెక్టర్లకు "డేటా వినియోగం ద్వారా ఇన్‌పుట్, అవుట్‌పుట్ బిజినెస్ అభివద్ధిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ ఎఫ్‌పిఒలు రైతులకు అవసరమైన పరికరాలు అందించడం, వారు పండించే పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం ద్వారా మధ్యవర్తుల సమస్య లేకుండా గిట్టుబాటు ధర సాధించవచ్చునన్నారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను ప్రతి ఎఫ్‌పిఒలో అమలు చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తూ ఎఫ్పిఓలు రైతులకు చేరువ కావాలన్నారు. ప్రస్తుతం ప్రకృతి సేద్యం ద్వారా పండిన పంటలకు అంతర్జాతీయ మార్కెట్లో అధిక డిమాండ్ ఉందని, రైతులు తమ పంటల వివరాలను Farmer.Chat యాప్ లో నమోదు చేయాలని సూచించారు. ఎఫ్‌పిఒల అభివృద్ధికి అవసరమైన సాంకేతిక శిక్షణలు, సలహాలు, యాప్ ఆధారిత పరిష్కారాలు నిరంతరం అందిస్తున్నామని తెలిపారు. రైతులంతా తమ మొబైల్ ఫోన్లో Farmer.Chat యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని అన్ని పంటలకు సంబంధించిన సలహాలు పొందాలని సూచించారు. ఈ యాప్‌లో పంట చిత్రం పంపి కూడా సలహాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, శిక్షకులు గిరిబాబు, నూకంనాయుడు, మాస్టర్ ట్రైనర్లు గొల్లు మురళీ మోహన్, క్రాంతి కుమార్, సిఇఒలు పి.మురళి, డి.వెంకటనాయుడు, నాగేశ్వరావుతో పాటు వివిధ ఎఫ్‌పిఒలు, 50 మందికి పైగా డైరెక్టర్లు పాల్గొన్నారు.


శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

విద్యార్థినిలకు, మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్ అని ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు, మహిళా పోలీసు ఎస్.పద్మ అన్నారు. స్థానిక గాయత్రి డిగ్రీ కళాశాల, శ్రీ వాసవి జూనియర్ కళాశాల్లో విద్యార్థినిలకు శక్తి యాప్ డౌన్లోడ్, రిజిస్ట్రేషన్, శక్తి యాప్ అందులో ఉండే 11 ఫ్యూచర్స్ ఉపయోగాలు, శక్తి యాప్ టోల్ ఫ్రీ నెంబర్ 112, మహిళలు రక్షణ చట్టం ,పోక్సో యాక్ట్, సైబర్ క్రైమ్ 1930, డ్రగ్స్ 1972 , ఈగల్, బాల్య వివాహం 1098, మొదలైన వాటి గురించి అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థిని తన మొబైల్ ఫోన్లో శక్తి యాప్ రిజిస్ట్రేషన్ చేసుకుని అందులో ఉండే 11 ఫ్యూచర్స్‌పై అవగాహన చేసుకుని ఆపద సమయంలో శక్తి యాప్ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో శక్తి బృందం ఇన్‌ఛార్జి, తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి వ్యక్తి మృతి

గంట్యాడ : బొండపల్లి మండలంలోని వెదురువాడ వద్ద తోటలో మంగళవారం పిడుగు పడటంతో గంట్యాడ మండలం పెదమజ్జి పాలెం గ్రామానికి చెందిన సుంకరి సూర్యనారాయణ(63) అక్కడికక్కడే మృతి చెందారు. తహశీల్దార్ రాజేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం.. పెదమజ్జి పాలెం గ్రామానికి చెందిన సూర్యనారాయణ వెదురువాడ సమీపంలోని తోటల్లోకి పశువులను మేతకు తీసుకెళ్లాడు. వర్షం కారణంగా పిడుగు పడటంతో ఆయన మృతి చెందాడు. విఆర్ఒ బొండపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చలో విశాఖ డెయిరీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి కొమరాడ

ఈనెల 24న జరగబోయే చలో విశాఖ డెయిరీ కార్యక్రమాన్ని పాల రైతులంతా పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం నాయకులు ఖాదర్ బాబ్జీనాయుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం పాల రైతుల సంఘం ఆధ్వర్యంలో చలో విశాఖ డెయిరీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, పాల రైతు సంఘం నాయకులు ఖాదర్ బాబ్జి నాయుడు మాట్లాడుతూ విశాఖ డైయిరీ అవినీతిపై వేసిన హౌస్ కమిటీ విచారణ పూర్తి చేసి దోషులను శిక్షించాలని, డెయిరీ ఆస్తులను కాపాడాలని, పాల సేకరణ ధర లీటరుకు పది రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి మూడు నెలలకు బోనస్ ఇవ్వాలని, చనిపోయిన రైతు కుటుంబానికి పరిహారం ఇవ్వాలని, పశువులకు ఉచిత బీమా, మందులు, దాణా 70శాతం రాయితీతో ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై తలపెట్టిన చలో విశాఖ డెయిరీలో పాడి రైతులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కెమిశీల హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని కెమిశీల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడ్ని తక్షణమే సస్పెండ్ చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు తాడంగి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎం, వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ మంగళవారం కొమరాడలో విలేకరులతో మాట్లాడారు. హెడ్‌మాస్టర్ తీరు వల్ల పాఠశాలలో గిరిజన విద్య కుంటుపడుతోందని వివరించారు. గతంలో అప్పటి ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాస్తవ పాఠశాల పరిశీలన సమయంలో హెడ్ మాస్టర్ బాధ్యతారాహిత్యం బయటపడిందని, అప్పుడు కూడా షోకాజ్ నోటీసు ఇచ్చారని తెలిపారు. అయినా ఆయన తీరు మారలేదన్నారు. ఇలా ఎన్నిసార్లు షోకాజ్ నోటీసు ఇస్తారని ప్రశ్నించారు. తక్షణమే హెడ్‌మాస్టర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ముందుండాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పర్చేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అన్నారు. జిల్లాలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యాచరణ అమలు తీరును కలెక్టర్ ఛాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపిడిలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థల్లో నిర్ణీత లక్ష్యాలు సాధిస్తున్నారని అదే విధంగా గ్రామాల్లో కూడా నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్ల పనులు వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇని ఆదేశించారు. గ్రామ స్థాయిలో తడి చెత్త పొడి చెత్త సేకరణ వివరాలు ప్రతిరోజు పిఆర్ 1 యాప్ లో అప్‌లోడ్ చేయాలన్నారు. వారం లోగా శతశాతం లక్ష్యాలు సాధించాలని తెలిపారు. చెత్త నుండి సంపద కేంద్రాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి అందిన దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని అన్నారు. సమావేశంలో సిపిఒ బాలాజీ, సిఇఒ సత్యనారాయణ, డిపిఒ మల్లిఖార్జున రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ కవిత, మున్సిపల్ కమిషనర్లు నల్లనయ్య, రామలక్ష్మి, అప్పలనాయుడు, హౌసింగ్ పీడీ మురళి, వర్చువల్‌గా ఎంపిడిఒలు పాల్గొన్నారు.

పిఎఫ్ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలో పని చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లు మొదలైన కాంట్రాక్టు వర్కర్లతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్న అధికారులు కాంట్రాక్టర్లు చేత పెరిగిన జీతాలు, పిఎఫ్ బకాయి డబ్బులు, ఇఎస్ఐ కార్డులు ఎందుకు ఇప్పించలేదని ఎ.పి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుగత అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఘోష ఆసుపత్రి వద్ద నిరసన తెలిపి ఆసుపత్రి హెచ్‌ఒడికి వినతి అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేసి పిఎఫ్ బకాయిలు విడుదల చేయాలన్నారు.